సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



భోజనాలకు అప్పులు..

జీజే కాలేజీల్లో మధ్యాహ్న భోజనాలకు తిప్పలు తప్పడం లేదు. అప్పులు చేయాల్సి వస్తోంది.

- 8లో



అయ్యో.. హోమియో

జిల్లాలో హోమియో వైద్యశాలలు మూతపడుతున్నాయి. సేవలు అందడం లేదు.

- 8లో

22 నుంచి ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎచ్చెర్లలో ఈ నెల 22వ తేదీ నుంచి జిల్లాలోని మహిళల కోసం బ్యూటీ పార్లర్ల నిర్వహణలో 35 రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనుంది. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ రామ్‌జీ తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు సంస్థ నిర్వాహకులు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 5వ తేదీన జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. అర్హత గల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత మండల విద్యాశాఖ అధికారుల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను సంబంధిత ఉప విద్యాశాఖాధికారులకు మాత్రమే సమర్పించాలన్నారు. నిర్ణీత దరఖాస్తుల నమూనాలు అన్ని మండల విద్యాశాఖ అధికారుల వద్ద ఉన్నాయని, మరిన్ని వివరాలకు 9492423420 సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ పోలినాటి వెలమ విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా అంబటి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : వైఎస్సార్ సీపీ పోలినాటి వెలమ రాష్ట్ర విభాగం అధ్యక్షుడిగా శ్రీకాకుళం నియోజకవర్గం సీనియర్ నేత అంబటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం శనివారం సాయంత్రం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. అంబటి ఇదివరకు వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడిగా, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. గతంలో రెండు సార్లు ఎంపీపీగానూ పని చేశారు. సర్పంచ్‌గా కూడా సేవలు అందించారు. ప్రస్తుతం ఈయన భార్య ఎంపీపీగా కొనసాగుతున్నారు. అధినాయకుడి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సహకారంతో పార్టీ కోసం కష్టపడి పని చేస్తానని ఆయన తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సీఎం చేసుకునేంతవరకు అలుపెరగకుండా శ్రమిస్తానని, తనకు పదవి రావడానికి దోహద పడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గురునాథ్ యాదవ్



టెక్కలి: వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా టెక్కలికి చెందిన గద్దిబోయిన గురునాథ్ యాదవ్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. టెక్కలిలో యాదవ సామాజిక వర్గానికి చెందిన గురునాథ్ యాదవ్ యాదవ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షునిగా, అహిర్ సంఘానికి అధ్యక్షునిగా ప్రస్తుతం సేవలు అందజేస్తున్నారు. బీసీ సెల్ విభాగానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు ఎమ్మెల్సీ నర్తు రామారావు, నాయకులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేస్తాం..



కోడి రామ్మూర్తి స్టేడియం పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తాం. వాయువేగంతో పనులు పూర్తిచేయాల్సిందేనని కాంట్రాక్టర్‌కు స్పష్టంగా హెచ్చరించాం. పనులు ఏడాదిలో ముగించి స్టేడియాన్ని జాతికి అంకితం చేస్తాం.

– 2024 జూలై 18న కోడిరామ్మూర్తి స్టేడియం పరిశీలన సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు

అంతర్జాతీయ స్థాయిలో స్టేడియం నిర్మాణం..



అంతర్జాతీయ స్థాయిలో కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తాం. ఏడాదిలోగా పనులు పూర్తి చేయడమే మా టార్గెట్.

– 2024 నవంబర్ 3వ తేదీన కోడిరామ్మూర్తి స్టేడియంలో పనులు పరిశీలన సందర్భంగా శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు చేసిన వ్యాఖ్యలు ఇవి

సూర్యభగవానుడి సాక్షిగా చెబుతున్నా..



శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఎదురుగా కనిపిస్తున్న సూర్యభగవానుడి సాక్షిగా చెబుతున్నా.. నన్ను గెలిపించండి స్టేడియాన్ని ఏడాది తిరిగే లోగా పూర్తిచేసి చూపిస్తా. నన్ను నమ్మండి. నాకు ఓటువేసి గెలిపించండి.

– 2024 మే 13వ తేదీన ఎలక్షన్ క్యాంపెయినింగ్ సందర్భంగా నాటి ఎమ్మెల్యే అభ్యర్థిగా కేఆర్ స్టేడియంలో క్రీడాకారులతో చేసిన వ్యాఖ్యలు ఇవి

స్టేడియానికి రావడానికి సిగ్గుపడుతున్నాం..



కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు సవాలక్ష కారణాలతో నిలిచిపోయాయి. స్టేడియం వద్దకు రావడానికి సిగ్గేస్తుంది. ఏడాది లోగా పనులు పూర్తి చేస్తామని నాడు చెప్పాం. ఇంకా చాలా పనులు చేయాల్సి ఉంది. మొత్తం రూ.5కోట్లు కాంట్రాక్టర్‌కు బిల్లు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవం. ఆ కాంట్రాక్టర్ మరెవరో కాదు.. సింహాచలంలో కూలిన గోడ కట్టిన వారే. ఆయన అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు.

– కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా 2025 ఆగస్టు ఒకటో తేదీన జరిగిన పీడీ-పీఈటీల జిల్లాస్థాయి సెమినార్ కమ్ వర్క్‌షాప్ సందర్భంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చేసిన వ్యాఖ్యలు ఇవి

స్టేడియం సిగ్గుపడుతోంది..!



క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు



జిల్లా కేంద్రంలో నాణ్యమైన క్రీడా మైదానం లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. కేఆర్ స్టేడియం పనులు త్వరితగతిన పూర్తయితే క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుంది.

– ఎం.సాంబమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా

ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి..



గత కొన్ని నెలలుగా కోడిరామ్మూర్తి స్టేడియం పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ పరిస్థితి అగమ్య గోచరం. సింహాచలం గోడ కూలిన ఘటనలో పనులు చేసింది ఈ కాంట్రాక్టరే. దీంతో ఈ కాంట్రాక్టర్ పేరు బ్లాక్ లిస్టులో ఉంది. బడ్జెట్ కేటాయింపులు జరగాల్సి ఉంది.

– డాక్టర్ కె.శ్రీధర్‌రావు, డీఎస్‌డీఓ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ

- కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు పూర్తయ్యేదెన్నడు..?
- ఎన్నికల ముందు తీవ్ర విమర్శలు చేసిన టీడీపీ నాయకులు
- అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో పనులు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ప్రగల్భాలు
- ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయిన పనులు

సాక్షి టాస్క్‌ఫోర్స్:

టీడీపీ నాయకుల మాట మార్చే వైఖరితో కోడిరామ్మూర్తి స్టేడియం సిగ్గుపడుతోంది. హడావుడిగా స్టేడియం నేలమట్టం చేసి, నాడు ప్రగల్భాలు పలికి.. నేడు సిగ్గుపడుతున్నాం అంటూ చెబుతున్న నాయకుల పనితనాన్ని చూసి రోదిస్తోంది. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం మూలకు చేరడంతో దశాబ్దాకాలంగా నాణ్యమైన క్రీడామైదానం లేక క్రీడాకారులు అల్లాడిపోతున్నారు. ప్రత్యామ్నాయ మైదానాల్లో నామమాత్రపు శిక్షణతో సరిపెట్టుకుంటున్నారు.

గతమెంతో ఘనం..

1983లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతుల మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రారంభమైంది. మల్టీపర్పజ్ స్టేడియంగా అన్ని క్రీడాంశాలను ఆడే విధంగా అవకాశం కల్పించారు. సుమారు 17వేల మంది ప్రేక్షకులు పోటీలను తిలకించే విధంగా గ్యాలరీలను నిర్మించారు. దానికి మరికొన్నాళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడాంశాలకు ఉపయుక్తంగా కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియంను సైతం నిర్మించారు. వందలాది మంది అంతర్జాతీయ, జాతీయస్థాయి ఆటగాళ్లతోపాటు శ్రీకాకుళాన్ని ప్రపంచ పటానికి పరిచయం చేసిన కరణం మల్లేశ్వరి, పూజారి శైలజ వంటి క్రీడాకారిణులు ఓనమాలు దిద్దుకున్నది కోడి రామ్మూర్తి స్టేడియంలోనే. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం స్టేడియం నిర్మాణాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. పరిపాలనా అనుమతులు లేకుండా 2016 మే 2వ తేదీన స్వయంగా నాటి సీఎం చంద్రబాబునాయుడు శిలాఫలకం వేసి వదిలేశారు. దానికి సరిగ్గా రెండేళ్ల తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టుల కేటాయింపులో నాడు క్రీడల మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు అన్నీ తానై చక్రం తిప్పారు. అనుకూలమైన వారికే కాంట్రాక్టు పనులను కట్టబెట్టారు. దీంతో ఆది నుంచి పనులు నత్తనడకనే జరుగుతుండేవి.



ఎక్కడి పనులు అక్కడే.. స్టేడియంలో లోపల పనుల తీరు ఇది

సబ్ కాంట్రాక్టర్లకు నిధులు చెల్లింపులు చేయపోవడం, కూలీలకు సైతం డబ్బులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అనేక సాంకేతిక సమస్యల కారణంగా పనులు సాగలేదు.

ధర్మాన కృషి.. గత సీఎం జగన్ చొరవ..

2022 జూన్ 27వ తేదీన నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి.. అమ్మఒడి మూడో విడత కార్యక్రమాన్ని శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా చేపట్టారు. నాడు మంత్రి ధర్మాన ప్రసాదరావు అదే వేదికపై కోడిరామ్మూర్తి స్టేడియం దీనస్థితిని గురించి వివరించారు. దీంతో అప్పటి సీఎం జగన్ నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కోడిరామ్మూర్తి స్టేడియంలో నిలిచిపోయిన పనులకు అవసరమయ్యే రూ.12 కోట్ల నిధులను జీఓ ఆర్టీ నంబర్ 202తో 2022 అక్టోబర్ 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. టెండర్లను పిలిచారు. పనులు మొదలు పెట్టారు.

కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లింపులు చేయకపోవడంతో..

అనంతరం 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలినాళ్లలో స్టేడియం విషయంలో తెగ హడావుడి చేసింది. చేసిందేమీ లేకపోయినా.. కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, శాప్ చైర్మన్ స్టేడియంను సందర్శించి గత ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఏడాదిలోగా పనులు పూర్తిచేస్తామని ప్రగల్భాలు పలికారు. కానీ ఇప్పటికీ పనులు ముందుకు కదల్లేదు. ప్రభుత్వం అసమర్థత, చేతకానితనాన్ని కాంట్రాక్టర్‌పై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు.

డ్రై'లేజీ'..!

- ఇష్టానుసారంగా డ్రైనేజీ నిర్మాణం
- కూలిన విద్యుత్ స్తంభాలు
- కాంట్రాక్టర్ అత్యుత్సాహం.. అధికారుల నిర్లక్ష్యమే కారణం



డ్రైనేజీ నిర్మాణంతో రోడ్డుకు అడ్డంగా కూలిన విద్యుత్ స్తంభాలు



విద్యుత్ స్తంభం చుట్టూ మట్టిని తవ్వేసి చేపడుతున్న డ్రైన్ నిర్మాణం

సంతబొమ్మాళి: కాంట్రాక్టర్ అత్యుత్సాహం, అధికారుల నిర్లక్ష్యం కలగలిపి ప్రజలకు శాపంగా మారింది. మురికి కాలువల నిర్మాణానికి ఇష్టానుసారం తవ్వేయడంతో విద్యుత్ స్తంభాలు కూలి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సంతబొమ్మాళిలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని మురికి కాలువ నిర్మాణానికి రూ.కోటి 80 లక్షల ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. కాలువ నిర్మాణానికి అడ్డంగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు సంబంధిత కాంట్రాక్టర్, పంచాయతీ రాజ్ అధికారులు తెలియజేశారు. విద్యుత్ స్తంభాలు మార్చడానికి ప్రస్తుతం ఫండ్ లేదని, ఆ ఖర్చులు మీరే భరించాలని చెప్పడంతో అందుకు వారు అంగీకరించలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ అత్యుత్సాహం ప్రదర్శించి కాలువల నిర్మాణంలో భాగంగా విద్యుత్ స్తంభాలను ఆనుకుని ఉన్న మట్టిని కూడా తీసేశారు. దీనికి తోడు వర్షాలు పడడంతో నాలుగు 33 కేవీ విద్యుత్ స్తంభాలు, నాలుగు 11 కేవీ విద్యుత్ స్తంభాలు శుక్రవారం రాత్రి నేలకూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. కోటబొమ్మాళి ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా అందించారు. ట్రాఫిక్ కూడా నిలిచిపోవడంతో ఇతర మార్గాల ద్వారా రాకపోకలను సాగించారు. శనివారం ఉదయం విద్యుత్ శాఖ డీఈ పర్యవేక్షణలో పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అధికారులకు తెలియజేశాం

డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని, విద్యుత్ స్తంభాలు మార్చాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేశాం. స్తంభాలు మార్చడానికి ఖర్చవుతుందని సమాధానం చెప్పారు. దీంతో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టాం.. రెండు రోజులు వర్షాలు పడడంతో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.

– కూచెట్టి కాంతారావు, కాంట్రాక్టర్, సంతబొమ్మాళి

ముందు చెప్పలేదు

డ్రైనేజీ తవ్వక ముందు మాకు చెప్పలేదు. తవ్విన తర్వాత తెలియజేశారు. దీంతో వెంటనే పరిశీలించాను. ఆ తర్వాత వర్షాలు రావడంతో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పునరుద్ధరించాం.

– శశిభూషణరావు, మండల విద్యుత్‌శాఖ ఏఈ, సంతబొమ్మాళి



పొన్నాడ బ్రిడ్జి వద్ద ఉన్న ఇస్కాన్‌లో శ్రీకృష్ణునికి అభిషేకాలు



శ్రీకాకుళంలో ఉట్టి కొట్టే సంబరం

కృష్ణం వందే జగద్గురుం

నెత్తిన నెమలి పింఛాలతో బుల్లి కృష్ణులు అలరించారు. నడుమున కడవలతో చిట్టి గోపికలు ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. కృష్ణుని వేషధారణలు, ఉట్టి కొట్టే పండుగలు జోరుగా జరిగాయి.

శ్రీకాకుళం కల్చరల్



కృష్ణవేషధారణ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

దైవ కార్యక్రమానికి అడ్డంకులు

- అచ్చెన్నపాలేం గ్రామదేవత ప్రతిష్టాపన నిలిచిన వైనం
- టీడీపీ నాయకుడి విపరీత ధోరణే కారణం



అచ్చెన్నపాలెంలో పోలీసు పికెట్

గార: తనకు ప్రాధాన్యం కల్పించడం లేదని ఏకంగా గ్రామ దేవత ప్రతిష్టాపన ఉత్సవాన్నే అడ్డుకున్నాడు ఓ టీడీపీ నాయకుడు. గార మండలం వాడాడ పంచాయతీ అచ్చెన్నపాలెంలో ఘటన జరిగింది. ఇక్కడ గాంధే అమ్మ(వేప చెట్టు) వద్ద కొన్నేళ్లుగా పూజలు జరుగుతున్నాయి. స్థానికుడు బంటుపిల్లి నాగేశ్వరరావు ఆలయాన్ని కొందరు దాతల సహకారంతో నిర్మించారు. అమ్మవారి ప్రతిష్ట జరపాలని తలచి గ్రామస్తుల్లో కొందరిని సంప్రదించి 17వ తేదీ ప్రతిష్టతో పాటు అన్నదానం చేయాలని నిర్ణయించారు. అయితే స్థానిక టీడీపీ నాయకుడు శిమ్మ శ్రీను తనకు సమాచారం ఇవ్వలేదనే నెపంతో కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి రాకపోయినా, ప్రతిష్టాపన కరపత్రాన్ని ఇచ్చేందుకు వెళ్లిన యువకుడిని చెంపదెబ్బ కొట్టినా ఓర్చుకున్నామని తెలిపారు. కానీ పోలీసులకు ఫిర్యాదు చేసి ప్రతిష్టాపనను అడ్డుకునేందుకు ప్రయత్నించాడని, స్టేషన్‌కు రెండు సార్లు పిలిస్తే వెళ్లామని, అక్కడ పోలీసులు అధికార పార్టీ వ్యక్తులకే మద్దతు తెలపడంతో వచ్చేశామని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం పోలీసులు గ్రామంలోకి వచ్చిన తర్వాత సమావేశం నిర్వహించే సమయంలో తోపులాట చోటుచేసుకుంది. దీంతో కార్యక్రమాన్ని వాయిదా వేయాలని, ఇరు పక్షాలు సర్కిల్ కార్యాలయంలో సమావేశానికి రావాలని శ్రీకాకుళం సర్కిల్ సీఐ పైడపునాయుడు కోరారు. గ్రామంలో పోలీస్ పికెట్ నడుస్తోంది.

ఎస్పీకి ఫిర్యాదు

శనివారం సాయంత్రం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి అచ్చెన్నపాలెం గ్రామస్తులు, వీహెచ్‌పీ, భజరంగ దళ్ సభ్యులు కలసి ఫిర్యాదు చేశారు. దైవ కార్యక్రమాలను నిలిపేయడం బాధాకరమని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

డీఈఓ పోస్ట్ .. భర్తీ ఎప్పుడో..?



- జిల్లా విద్యాశాఖ అధికారిని నియమించని ప్రభుత్వం
- కీలక సమయంలో కొరవడిన పర్యవేక్షణ
- పేరుకు పోతున్న ఫైళ్లు

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి నియామకం చేపట్టకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. గత నెల 31న జిల్లా విద్యాశాఖ అధికారి పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. అప్పటి నుంచి ఏ ఒక్కరినీ నియమించేందుకు రాష్ట్ర అధికారులు చర్యలు తీసుకోలేదు. వాస్తవానికి జిల్లా స్థాయి అధికారి పదవీ విరమణ చేస్తున్నప్పుడు ఓ రోజు ముందుగాను, అదే రోజున వేరొకరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీలు చేయడం పరిపాటి. అలాంటిది అత్యంత కీలకమైన విద్యాశాఖ అధికారి పోస్టును 17 రోజులుగా భర్తీ చేయకుండా ఉంచేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తుండగా కీలక దశలో డీఈఓ పోస్టు ఖాళీగా ఉండడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. వేరొకరిని నియమించే వరకు పూర్తి అదనపు బాధ్యతలతో మరొకరిని నియమించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా కూడా చర్యలు చేపట్టలేదు. బీఈడీ డిగ్రీ లేని ఓ ఏడీకి నామమాత్రంగా బాధ్యతలు ఇచ్చేశారు. డైట్‌లో సీనియర్ లెక్చరర్లతో పాటు బీఈడీ పూర్తి చేసిన ఉప విద్యాశాఖాధికారులు ఉన్నా వారిని నియమించలేదు. జిల్లాలో కీలక భూమిక పోషిస్తున్న ఓ ప్రజా ప్రతినిధి తనకు కావాల్సిన వారిని నియమించేందుకే ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించకుండా, కొత్తవారిని నియమించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ నాయకుడు ఆలోచిస్తున్న వ్యక్తి బీఈడీ పూర్తి చేయకపోవడంతో ఆ డిగ్రీ పూర్తయ్యే వరకు ఇలా అడ్డుకుంటారని ప్రచారం జరుగుతోంది. ఆ వ్యక్తి ఇటీవలే బీఈడీ పరీక్షలు రాయగా, ఫలితాలు వచ్చేందుకు మరో వారం పది రోజులు పడుతుందని అప్పటివరకు విద్యాశాఖ అధికారి పోస్టు భర్తీ జరగదని విద్యాశాఖ వర్గాలు బహిరంగంగానే చర్చించుకుంటున్నాయి. కీలకమైన జిల్లా విద్యా శాఖ అధికారి పోస్టు ఇన్ని రోజులు భర్తీ చేయకుండా ఉండడం జిల్లా చరిత్రలో ప్రథమమని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

జిల్లాలో జోరుగా వానలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు 365.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉదయం 8 గంటలకు 203.8 మిల్లీమీటర్లు, 8 నుంచి ఒంటి గంటల వరకు మరో 35.4 మిల్లీమీటర్లు, ఒంటి గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు 128.4 మిల్లీమీటర్ల వాన పడింది. ఎక్కువగా సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురంలో వర్షం కురిసింది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్..

జిల్లాలో కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తమయ్యారు. నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో 08942 220557 నంబర్‌ను ఉంచారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్లతో పాటు 30 మండలాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎచ్చెర్లలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఐటీఐ, స్కిల్ హబ్ సెంటర్లలో ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులకు శిక్షణను అందించనున్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. టెన్త్ ఆపై విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన యువకులు అర్హులని చెప్పారు. శిక్షణ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌తోపాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని సుధాకర్ పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత తెలుపు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 2 పాస్‌ఫొటోలతో ఆగస్టు 20వ తేదీలోపు ఎచ్చెర్ల స్కిల్‌హబ్ సెంటర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 7989177887 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

షాపు తెరవనే లేదు.. అయినా రూ.7వేల బిల్లు


సెల్‌లో విద్యుత్ బిల్లు చూపిస్తున్న తేజ

టెక్కలి: తాను షాపు తెరవకపోయినా రూ.7,240ల విద్యుత్ బిల్లు వచ్చిందంటూ టెక్కలి పాత పెట్రోల్ బంక్ ఎదురుగా వాటర్ సర్వీసింగ్ సెంటర్ యజమాని కురుమోజు తేజ వాపోయాడు. తన చేయి విరిగిపోవడంతో గత రెండు నెలలుగా షాపు తెరవడం లేదని, అయినప్పటికీ స్మార్ట్ మీటర్ పుణ్యమా అని వేల రూపాయల విద్యుత్ బిల్లు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకు మునుపు ప్రతి నెల రూ.700 లోపు బిల్లు వచ్చేదని వివరించాడు. స్మార్ట్ మీటర్ అమర్చిన కొత్తలో రూ.78 వేల బిల్లు వచ్చిందని, దీనిపై అధికారుల ఫిర్యాదు చేయగా రూ.700 బిల్లుకు అదనంగా మరో రూ.700 వేసి రూ.1400 వసూలు చేశారని తెలిపారు. అత్యధికంగా బిల్లుల మోత మోగిస్తున్న స్మార్ట్ మీటర్‌ను తక్షణమే తొలగించి తనకు వచ్చిన బిల్లును తగ్గించాలని కోరాడు.

విజిలెన్స్ కమిషనర్‌కు సత్కారం


అనిల్‌చంద్ర పునేఠాను సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు


శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిలచంద్ర పునేఠా శనివారం కలెక్టర్ బంగ్లా వద్ద పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, రామలింగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళులు


సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్వాతంత్య్ర సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న పోరాటాలు భావితరాలకు తెలియాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీలతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పైడి శెట్టి జయంతి, చౌదరి బాబ్జీ, రమణమాదిగ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు, డీబీసీడబ్ల్యూఓ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వజ్రపుకొత్తూరు: పూండి రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో పట్టాలపై శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. మృతుడు గులాబీ టీ షర్టు, సిమెంట్ కలర్ షార్టు ధరించి ఉన్నాడని, గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతిచెంది ఉంటాడని చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్‌పీ నెంబరు 9440627537కు తెలియజేయాలని కోరారు.

భోజనాలకు అప్పులు.. నిర్వాహకులకు తిప్పలు


కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వంట ఏజెన్సీ సభ్యులు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు అందని బిల్లులు
- గౌరవ వేతనాలు సైతం చెల్లించని పాలకులు
- ఎనిమిది నెలలుగా తప్పని అవస్థలు


మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

కొత్తూరు: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు అందక వంట ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నా బిల్లులు మంజూరు కావడం లేదని, కనీసం గౌరవ వేతనం సైతం అందడం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది జనవరి నుంచి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 30 మండలాల్లో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో భోజన పథకం అమలు చేస్తున్నారు. విద్యార్థులకు వంట చేసి భోజనం పెట్టేందుకు 150 మంది మధ్యాహ్న భోజన కార్మికులను నియమించారు. వీరు సుమారు 12800 మంది విద్యార్థులకు భోజనాలు వండి పెడుతున్నారు. ఒక్కో విద్యార్థి భోజనానికి ప్రభుత్వంరూ.9.27 పైసలు చెల్లించాల్సి ఉంది. అదే విధంగా, నిర్వాహకులకు గౌరవ వేతనం కింద ఒక్కొక్కరికి నెలకు రూ.3వేలు చెల్లించాల్సి ఉంది. అయితే పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇంతవరకు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పు చేసి పప్పుకూడు..

బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వండి పెట్టాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. కూరగాయలు, పప్పు, నూనె, కిరాణా సామగ్రితో పాటు వంట చెరుకులు నిత్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని ఆశతో అప్పులు చేస్తున్నామని, అయితే ఇంత వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం సబబు కాదని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటుతుండటంతో వాటిని కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

త్వరలోనే చెల్లిస్తాం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బడ్జెట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మరో వారం రోజుల్లో వంట ఏజెన్సీ సభ్యులకు బిల్లులతో పాటు గౌరవ వేతనాలు జమవుతాయి.

– పి.దుర్గారావు, ఆర్ఐఓ, శ్రీకాకుళం

గౌరవ వేతనమేదీ?

పథకం ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకు ప్రతినెలా చెల్లించాల్సిన గౌరవ వేతనం రూ.3వేలు అందించకపోవడం తగదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట నిర్వహణ కారణంగా ఇతర కూలి పనులకు కూడా వెళ్లలేకపోతున్నామని అంటున్నారు. ఉపాధి పనులకు వెళ్లినా రోజుకు రూ.250 వస్తుందని, కాలేజీలో వండి పెడితే రోజుకు వంద రూపాయలు కూడా రావడం లేదని, అది కూడా ప్రతి నెలా చెల్లించకపోవడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులతో పాటు గౌరవ వేతనం తక్షణం చెల్లించాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు..



ఎనిమిది నెలలుగా బిల్లులు చెల్లించక పోవడంతో అప్పులు చేసి వంటలు చేయాల్సి వస్తోంది. గౌరవ వేతనాలు కూడా ఇంతవరకు చెల్లించలేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నాం. ఇతర పనులకు వెళ్లలేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

– ఎ.సుందరమ్మ, వంట ఏజెన్సీ సభ్యురాలు, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఎనిమిది నెలలుగా..



వంట ఏజెన్సీ సభ్యులుగా చేరడం వల్ల ఉపాధి పనులకు రానివ్వడం లేదు. వంట సభ్యులుగా చేరి ఎనిమిది నెలలు గడుస్తున్నా బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించడం లేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నాం. బిల్లులు ప్రభుత్వం చెల్లించిన వడ్డీలకు సరిపోయేలా లేవు.

– కె.కన్నెమ్మ, వంట ఏజెన్సీ సభ్యురాలు, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

బాక్సింగ్ భార్గవ్

- జూనియర్ ఇండియన్ బాక్సింగ్ టోర్నీలో కాంస్య పతకం సాధించిన సత్యభార్గవ్
- ఇండియన్ కోచింగ్ క్యాంపునకు ఎంపిక
- భారత జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యంగా సాధన


కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నుంచి అభినందనలు అందుకుంటూ..


బాక్సింగ్ సాధనలో..

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు యువ బాక్సింగ్ సంచలనం గంధం సత్యభార్గవ్ ఆకాశమే హద్దుగా రాణిస్తున్నాడు. ఇప్పటికే అనేక టోర్నమెంట్లలో సత్తాచాటిన భార్గవ్ ప్రతిష్టాత్మక ఆలిండియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకంతో మెరిశాడు. దీంతో హర్యానాలోని రోతక్ వేదికగా ఆగస్టు 2 నుంచి 15వ తేదీ వరకు జరిగిన ఇండియన్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. రెండు వారాలపాటు శిక్షణ పాఠాలు నేర్చుకున్న భార్గవ్ క్యాంప్ ముగించుకుని జిల్లాకు పయనమయ్యాడు. ఇండియన్ బాక్సింగ్ జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు. బలగలోని జంగమ వీధిలో నివాసముంటున్న భార్గవ్ తండ్రి గంధం వీర కుమార్ పురోహితుడు, తల్లి పుష్పలత గృహిణి. పురోహితమే వీరి జీవనాధారం. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇద్దరు పిల్లలు ఢిల్లేశ్వర్, భార్గవ్ ఆటలపై ఆసక్తి పెంచుకున్నారు. ఇద్దరూ డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు వద్ద శిక్షణ పొంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

ఇండియన్ క్యాంప్‌కు ఎంపిక..

భార్గవ్ 2019లో బాక్సింగ్‌లో ప్రవేశం పొందాడు. కోవిడ్‌తో టోర్నీలు లేక.. ప్రాక్టీస్‌కే పరిమితమయ్యాడు. 2022లో విశాఖపట్నంలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో రజత పతకం, ఆ తర్వాత వరుసగా 2023 రాజమండ్రిలో, 2024లో విశాఖపట్నంలో జరిగిన స్టేట్‌మీట్‌లో బంగారు పతకాలు సాధించాడు. తాజాగా విశాఖపట్నంలో జరిగిన జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లోఅద్భుతంగా రాణించి బంగారు పతకంతో మెరిశాడు. బాక్సింగ్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానాలోని రోతక్‌లో జూలై 18 నుంచి 24 వరకు జరిగిన ప్రతిష్టాత్మక 6వ జూనియర్ నేషనల్స్ బాక్సింగ్ మీట్‌లో 80–85 కేజీల విభాగంలో కాంస్య పతకంతో మెరిశాడు. ఫైనల్ బెర్త్ కోల్పోయినా సెలక్టర్లను ఆకర్షించి ఇండియన్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. హర్యానాలోని రోతక్ వేదికగా శిక్షణ ముగించుకుని జిల్లాకు తిరుగుముఖం పట్టాడు. అక్టోబర్‌లో మరోసారి జరిగే ఇండియన్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొనాలని బీఎఫ్ఐ ఎన్ఐఎస్ కోచ్‌లు సూచించినట్టు భార్గవ్ చెబుతున్నాడు. భార్గవ్ ప్రస్తుతం ఇంటర్మీడియెట్ సెకెండియర్ చదువుతున్నాడు. భార్గవ్‌ను బాక్సింగ్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బీపీ లక్ష్మణ్‌దేవ్, వంగా మహేష్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, జిల్లా బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు అభినందించారు.

అందరి ప్రోత్సాహంతో..

తల్లిదండ్రులు, అన్నయ్య స్ఫూర్తితో బాక్సింగ్‌లో ప్రవేశం పొందాను. కోచ్ ఉమామహేష్, సంఘ పెద్దలు, కాలేజ్ ఫ్యాకల్టీ ప్రోత్సాహంతో నిరంతరం సాధన చేస్తున్నాను. నేషనల్ మెడల్ సాధించి, ఇండియన్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికైనందుకు గర్వంగా ఉంది. భారత జట్టుకు ఎంపిక కావడం, ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించడమే నా జీవిత ఆశయం.

– గంధం సత్యభార్గవ్, బాక్సింగ్ ప్లేయర్

25న డీఎస్సీ–2003 టీచర్ల మహాధర్నా


మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వ మెమో 57ను రాష్ట్రంలోనూ వర్తింపజేసి డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ మంజూరు చేయాలని 2003 డీఎస్సీ ఫోరం ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం ఎన్జీవో హోంలో శనివారం ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి అధ్యక్షతన మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ పాత పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు, బాధిత ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు 2004 సెప్టెంబర్ ఒకటికి ముందే నియామక ప్రక్రియ పూర్తయినప్పటికీ.. పోస్టింగులు మాత్రం ప్రభుత్వ విధానాల వల్ల జాప్యం జరిగిందన్న విషయాన్ని ప్రభుత్వాలు మర్చిపోవద్దని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడి ధోరణి ప్రదర్శిస్తు జాప్యం చేస్తుండటంతో గత్యంతరం లేని పరిస్థితులలో ధర్నా చేపట్టాల్సి వస్తోందన్నారు.రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు 16 రాష్ట్రాలు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మెమోను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దుప్పల శివరాం ప్రసాద్ (ఆపస్), ఎస్వీ రమణమూర్తి(ఎస్టీయూ), దానేటి కేశవరావు (పీఆర్‌టీయూ), కూన రంగనాయకులు (ఎస్ఎల్‌టీఏ), పూజారి హరిప్రసన్న(డీటీఎఫ్), సూర పాపారావు (ఎన్‌టీఏ), కరిమి రాజేశ్వరరావు (ఏపీ సీపీఎస్ఈఏ), గురుగుబెల్లి భాస్కరరావు (ఏపీ సీపీఎస్‌యూఏ), ఫోరం జిల్లా కో కన్వీనర్లు ఏ.తిరుమలేశ్వరరావు, ఏ.లక్ష్మణ్, జి.గోవిందరావు, నారాయణరావు, ఫల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ అనుచిత ప్రవర్తన

- మహిళా ఉద్యోగికి వేధింపులు
- తూతూమంత్ర చర్యలకు సరిపెట్టిన అధికారులు
- రిమ్స్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

శ్రీకాకుళం : శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రిలోని పలమనాలజీ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి.. తోటి మహిళా ఉద్యోగిపై అనుచితంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై రిమ్స్ అధికారులు తూతూమంత్రపు చర్యలతో సరిపెట్టారు. సదరు డేటా ఎంట్రీ ఆపరేటర్ పలమనాలజీ విభాగంలో వైద్యునిగా ఉన్న వ్యక్తిపై కూడా దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. వీరిద్దరూ వేర్వేరుగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రిమ్స్ అధికారులు విచారణ కోసం ఐదుగురు సభ్యులతో కమిటీ వేశారు. ఇందులో వైద్యులతో పాటు అడ్మినిస్ట్రేటర్ కూడా విచారణాధికారిగా పాల్గొన్నారు. కమిటీలోని సభ్యులకు నామమాత్రపు చాన్స్ ఇచ్చిన అడ్మినిస్ట్రేటర్ అంతా తానై వ్యవహరించి విచారణ పూర్తి చేశారు. విచారణ సమయంలోనూ డేటా ఎంట్రీ ఆపరేటర్ చేసిన వ్యాఖ్యానాలు సరిగా లేవని విచారణలో పాల్గొన్న వైద్యులే చెబుతున్నారు. తమకు నామమాత్రపు అవకాశం ఇచ్చారని, ఈ కారణంగా తామేమీ మాట్లాడలేకపోయామని అంటున్నారు. అనుచితంగా, దురుసుగా ప్రవర్తించిన ఉద్యోగి వల్ల తనకు హాని ఉందని వైద్యుడు విచారణ అధికారుల ఎదుట చెప్పగా, తనది కూడా సేమ్ ఫీలింగ్ అని విచారణలో పాల్గొన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ అన్నట్లు విచారణ సభ్యులే బహిరంగంగా చెబుతున్నారు. ఇలా వ్యవహరించిన ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోకుండా వేరొక విభాగానికి మార్చడాన్ని రిమ్స్ ఉద్యోగులు వైద్యులు తప్పుపడుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆకాశవాణిలో లలితారెడ్డి ప్రసంగాలు

జి.సిగడాం: జి.సిగడాం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పీజీటీ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న లలితారెడ్డి ప్రసంగాలు ఈ నెల 18 నుంచి 23 వరకు విశాఖలోని ఆకాశవాణిలో ప్రసారం కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 6.30 గంటల నుంచి చింతన కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై ఆమె మాట్లాడతారు.

నాలుగు దశాబ్దాల తర్వాత..


హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు శనివారం స్థానిక కల్యాణ మండపంలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత కలిసిన వీరంతా ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. – హిరమండలం

నిర్లక్ష్యపు వరద

కొత్తూరులోని రెల్లివీధిలోకి హడ్డుబంగి గెడ్డ నీరు చొరబడింది. శనివారం భారీ వర్షం కురవడంతో హడ్డుబంగి గెడ్డలోకి వర్షం నీరు చేరింది. గెడ్డలో పూడికలు తొలగించకపోవడంతో వరద నీరు అమాంతం వీధిలోకి వచ్చేసింది. ఇటీవలే సర్పంచ్ పడాల కృష్ణవేణి రెల్లివీధిలో ఉన్న మురుగు నీటి కాలువల్లో చెత్తను తొలగించారు. అయితే ఈ వరద నీరు చేరడంతో చేసిన పనులన్నీ వృథా అయిపోయాయి. –కొత్తూరు



అయ్యో.. హోమియో!

- వైద్యులు లేక మూతపడుతున్న వైద్యశాలలు
- ఏడాదిగా సరఫరా కాని మందులు


శ్రీముఖలింగంలో తెరుచుకోని హోమియో వైద్యశాల


చీడిపూడి హోమియో ఆస్పత్రిలో అరకొరగా ఉన్న మందులు

సారవకోట: జిల్లాలో పలు హోమియో వైద్యశాలల పరిస్థితి దయనీయంగా మారింది. ఓవైపు మందులు కొరత, మరోవైపు వైద్యులు లేక పలు ఆస్పత్రులు తెరుచుకోవడం లేదు. దీంతో హోమియో మందులు వాడుతున్న రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాలో ఆయుష్ విభాగంలో చీడిపూడి, శ్రీముఖలింగం, పాతపట్నం, తెంబూరు, పొన్నాడ, కింతలి, తొగరాం, బ్రాహ్మణతర్ల, తోటవాడ, శ్రీకాకుళం, జగతి, సంతవురిటి గ్రామాల్లో హోమియో వైద్యశాలలు ఏర్పాటు చేశారు. వీటిలో శ్రీముఖలింగం, తొగరాం, పాతపట్నం, బ్రాహ్మణతర్ల ఆస్పత్రుల్లో వైద్యులు లేరు. పాతపట్నం, బ్రాహ్మణతర్ల ఆస్పత్రుల్లో కాంపౌండర్లే ఆస్పత్రులు తెరుస్తున్నారు. శ్రీముఖలింగం, తొగరాంలలో వైద్యులు, సిబ్బంది లేక తెరుచుకోవడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలలో హోమియో వైద్యం నమ్ముకున్న వారికి సేవలందని పరిస్థితి. వీరంతా శ్రీకాకుళం, ఇతర ప్రాంతాలలో ప్రైవేట్ హోమియో వైద్యులపై ఆధారపడుతున్నారు.

వెంటాడుతున్న మందుల కొరత..

జిల్లాలోని హోమియో ఆస్పత్రులకు రెండేళ్లుగా మందులు సరఫరా కావడం లేదు. అందుబాటులో ఉన్న అరకొర మందులను రోగులకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని చోట్ల అవసరమైన మందులు ప్రయివేట్ మందుల దుకాణాలలో కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు. సంవత్సరాల తరబడి మందులు సరఫరా చేయకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు పలు చోట్ల ఆస్పత్రుల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి హోమియో ఆస్పత్రులపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మందులు లేవు..



హోమియో వైద్యంతో నమ్మకంతో ఆస్పత్రికి వస్తున్నాం. వైద్యులు సేవలందిస్తున్నప్పటికీ అవసరమైన మందులు లేక వేరేచోట కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచితే మంచిది.

– పొన్నాన హరిప్రసాద్, లక్ష్మీపురం, సారవకోట మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం..



మందుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఏయే మందులు ఆస్పత్రికి అవసరమో వాటి వివరాలు పంపించాం. ఆయుష్ శాఖ మందులు పంపిస్తే రోగులకు అందుబాటులో వస్తాయి.

– ఉమాగౌరి, హోమియో వైద్యులు, తెంబూరు, పాతపట్నం మండలం

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

శ్రీకాకుళం: ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలుచేయాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారు పోతల దుర్గారావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. యాప్‌ల విధానాన్ని రద్దు చేసి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. పీఆర్సీని ప్రకటించాలని, విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, పీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఇతర లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం..

అధ్యక్షుడిగా ఎండీ సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్ను వెంకటరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కొప్పల డేనియల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొంత సుబ్బారాయుడు, రాష్ట్ర కోశాధికారిగా ఆవల అప్పన్న, రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా అంబటి ఆదినారాయణ, రాష్ట్ర సహాధ్యక్షుడిగా భూపతి రవికుమార్, కింజరాపు నూకరాజులను ఎన్నుకున్నారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా ఆవల అప్పన్న, ప్రధాన కార్యదర్శిగా కింజరాపు నూకరాజులు ఎంపికయ్యారు.


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడు దుర్గారావు